# యత్నంలేని యశస్సు

‘శంగోపి’



శివపురంలోని జనోపయోగ గ్రంధాలయంనుంచి ఒక జాబు వచ్చింది — ఆ గ్రంధాలయం వార్షికోత్సవానికి నన్నుప్రధానోపన్యాసకునిగా నిర్ణయించినట్లూ, గ్రంధాలయోద్యమ నాయకుడు రమేశ్‌బాబు అధ్యక్షత వహించడానికి సమ్మతించినట్లూ, నా అంగీకారం తెలిసినవెంటనే ఆహ్వానపత్రిక అచ్చువేయ దలచినట్లూ గ్రంధాలయాధికారి వీరేశ్వరరావు ఆ జాబు వ్రాశాడు.

అతనితో నాకు పరిచయం లేదు. పరిచయం లేకున్నా ఆ రీతిని నన్ను ఆహ్వానించడానికి నేను ప్రసిద్ధ వ్యక్తిని కాను. ఆ జాబు చదివి ఆశ్చర్యపోయాను. అది నాకేనా అనే అనుమానంతోచి ఎడ్రస్సు రెండుమూడుసార్లు చదువుకుని—అది నాకే అని ధృవపరుచుకున్నాను.

శివపురంలోగాని, ఆ చుట్టుపక్కలగాని నన్ను ఎరిగినవ్యక్తి వున్నట్లు జ్ఞప్తిలో లేదు. మరి నా పేరు అతనికి ఎలా తెలిసినట్లు? ఆమధ్య రెండుమూడు సార్లు—పత్రికలో పడిన నా వ్యాసాలు చూచి ముగ్ధుడై వీరేశ్వరరావు యీలా వ్రాసి ఉంటా అని తీర్మానించుకున్నాను.

వెంటనే నా అంగీకారాన్ని అతనికి ఎక్స్‌ప్రెస్ డెలివరీ లెటరు మూలంగా తెలియచేశాను.

ఈ సమాచారం వెంటనే మా మిత్రమండలికి తెలిసిపోయింది. వారందరూ నన్ను అభినందించారు.

‘చూడరా, మన ధనంజయం అదృష్టం! ఒకటి రెండుసార్లు పత్రికకు ఎక్కేసరికే ఆహ్వానాలు వస్తున్నాయి ఉపన్యాసాలు యివ్వమంటూ’ అని గోపు నా యెదుటే కౌస్తుభంతో అన్నాడు.

‘మనవాడివల్ల మన మిత్రులందరికీ ఒక గౌరవం వచ్చిందనుకో? అక్కడినుంచి రాగానే మనం ఘనంగా సమ్మానించాలి. దానికి తగిన యేర్పాట్లు యిప్పట్నుంచే జరగాలి’ అని కౌస్తుభం అందుకున్నాడు.

పొంగి పొరలి వస్తున్న ఆనందాన్ని లోలోపలనే అణచుకుని ఒక్క చిరునవ్వు నవ్వేశాను.

మరొక వారంలోపుగానే అచ్చయిన ఆహ్వానపత్రికలు వచ్చాయి, పరిచిత మిత్రులకు ఇవ్వడానికని వీరేశ్వరరావు అదనంగా పదింటిని పంపాడు. కొందరు మిత్రులు నాతోకూడా శివపురానికి రావడానికి సిద్ధమయ్యారు. కాని అనవసరంగా రైలు ఖర్చులు ఎందుకనిచెప్పి రావద్దన్నాను. ఉపన్యాసం యెలాగూ పత్రికలలో పడుతుంది కాబట్టి దాన్ని చదివి తృప్తిపడాలని కోరాను.

ఆనాటి మహాసభలో నేను ప్రధానోపన్యాసకుడిని. అంటే యింకా మరికొన్ని ఉపన్యాసాలుంటాయన్నమాట! తక్కిన వారి ఉపన్యాసాలకంటె నా దానిలో కొంత విశిష్టత ఉండాలిగదా! అందుకని రెండు రోజులు తీవ్రంగా ఆలోచించి చక్కని వ్యాసం తయారు చేశాను. అందులో గ్రంధాలనూ, గ్రంధాలయాలనూ గురించి మాత్రమే కాకుండా అందరికీ ఆసక్తిని కలిగించే రాజకీయాలను గురించి కూడా తీవ్రంగా వ్రాశాను. భాషలో ఒక విప్లవాన్ని లేవదీసి జనులలో నూతన చైతన్యం కలిగించేవిధంగా ఆ వ్యాసం తయారైనది. నాకు ఎంతో తృప్తి కలిగింది.

రాత్రి ప్రయాణమనగా—ఉదయంనుంచీ ఆ ప్రయత్నంలోనే వున్నాను. చిన్న సూట్‌కేసులో ముద్రణకు సిద్ధం చేసివున్న నా రచనలనూ, మూడుజతల దుస్తులనూ, అవసరమైన వస్తువులనూ పెట్టాను. అన్నిటినీ సమంగా పెట్టానో లేదో అని చూచుకొనడానికి రెండుసార్లు సర్దవలసి వచ్చింది. బెడ్డింగును చక్కగా చుట్టి కట్టడానికి అరగంటసేపు పట్టింది.

ఈ హడావిడి అంతాచూసి మా శ్రీమతి ‘ఒక్కరోజు వుండేదానికి యింత ప్రయత్నం దేనికి? రెండు ధోవతులూ. రెండు జుబ్బాలు, రెండు బనియన్లూ, ఒక పైవస్త్రం సంచీలో పెట్టుకొని వెళ్లితే తీరిపోతుంది. కూలివాడి గొడవ తప్పిపోతుంది కూడాను’ అని సలహా యిచ్చింది.

ఆ సలహా వినేసరికి నాకు కోపం వచ్చింది. ‘నేను వెళ్లేది ఒక పెద్ద గ్రంథాలయ వార్షికోత్సవంలో ముఖ్యోపన్యాసకుడుగా; నేను చేతిసంచీతో రైలు దిగితే నా కోసం స్టేషనులో కాచుకున్న తగుమనుషులు ఏమనుకుంటారు! ఇంతకూ సెకెండుక్లాసు పెట్టెనుంచి సంచీ పట్టుకుని దిగమన్నావా?’ అని అన్నాను.

‘మీరు సెకండుక్లాసు పెట్టెలో ప్రయాణం చేస్తారా? బోలెడంత డబ్బు టిక్కట్టుకే అవుతుందే!’

‘అయితే కానీ; నన్ను పిలిచినవారు ఖర్చులన్నీ భరిస్తారు. మనకేమీ నష్టం వుండదు గదా!’

‘వాళ్లు మూడోతరగతి ఛార్జియే యిస్తే!’

‘శకునపక్షిలా మొదట్నే కుశ్శంకలు వేస్తావేమిటి? నేను పెట్టె బెడ్డింగులతో

వెళ్ళకా తప్పదు? హోదాకు తగినట్లు సెకెండుక్లాసులో ప్రయాణం చెయ్యకా తప్పదు. వేలకొద్దీ యీ మహోత్సవానికి ఖర్చు చేస్తున్నవాళ్ళు ప్రధానోపన్యాసకుడికి అధమం సెకెండుక్లాసు ఛార్జీ అయినా యివ్వకపోరు. మరి నువ్వు యేమీ అడ్డులు చెప్పకు' అనీ చాలా చికాకుతోనే సమాధానం చెప్పాను.

'అయితే మీ యిష్టం' అని ఆవిడ మారు మాటాడక మూతి ముడుచుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి పెందరాళే భోజనం చేసి జట్కా కట్టించుకుని స్టేషనుకు వెళ్ళాను. నాకు వీడ్కోలు యివ్వడానికి గోపు, కౌస్తుభం అక్కడికి వచ్చారు. అదృష్టవశాత్తూ సరియైన టైముకే బండీ వచ్చింది.

నేను సెకెండుక్లాసు పెట్టెయెక్కి, సామాను బండిలో పెట్టిన పోర్టరుకు నిర్లక్ష్యంగా ఒకరూపాయి కూలి యిచ్చివేశాను. వాడు వంగి వంగి నమస్కారంచేసి తృప్తిపడి వెళ్ళిపొయ్యాడు. బండి కదిలేదాకా మిత్రులు నే కూర్చున్నపెట్టె ప్రక్కనే నిలబడి మాటలాడుతూ, బండీ కదిలాక చేతిరుమాళ్ళు విసురుతూ వీడ్కోలు తెలిపారు.

నాడు బండీలో రద్దీ లేదు. నేను బెడ్డింగు విప్పి పరుచుకుని నడుం వాల్చాను. రాత్రి పదిగంటలయినా నిద్ర రాలేదు. ఏవేవో ఆలోచనలు! బండీ స్టేషనులో ఆగేసరికి శివపుర మహాజనులు అక్కడ హాజరుగా వుంటారనీ, నేను బండీనుంచి దిగగానే వినయం చూపుతూ కారులో బసకు తీసుకువెళ్తారనీ ఊహిస్తూ, మొదట వారితో ఎలా సంభాషణ ప్రారంభించాలో ఆలోచించ సాగాను. ఆ ఆలోచనలోనే నిద్రపట్టింది, కొంచెం.

ఆ నిద్రలోనే ఒకకల. రైలుబండీ ఒకగంట లేటుగా శివపురం స్టేషనుకు వచ్చింది. నాకోసం చాలామంది పెద్ద మనుష్యులు పూలదండలతో ప్లాట్‌ఫారం మీద కాచుకొని వున్నారు. వీరేశ్వరరావు నాకోసం వెతుకుతున్నాడు. నేను బండీ నుంచి దిగాను. పత్రికలో వ్యాసాలతో పాటు యిదివరకు నా ఫోటోపడి వుంది గదా! దాన్నిచూసే కాబోలు గుర్తుపట్టి నా దగ్గరకు వచ్చి కరచాలనంచేసి పూలమాల మెడలో వేశాడు. మరేముంది? నా మెడ రోజా మాలలతో నిండిపోయింది. ఆయన నన్ను కారులో కూర్చోపెట్టి తాను నాపక్కనే కూర్చున్నాడు. ఆ కారు ఎక్కడకు వెళ్ళిందో ?

ఇంతలో తెలివి వచ్చింది. నేను బండీలోనే ఉండడం చూసుకుని 'యిది కల' అని అనుకున్నాను. మరి కొద్ది సేపటికి మళ్ళీ కునుకు పట్టింది. మళ్ళీ ఒక కల వచ్చింది. శివపురం స్టేషను వచ్చింది. ప్లాట్‌ఫారం మీద పిట్టమనిషి కూడా లేడు. పోర్టరుకూడా కానరాలేదు. నేను నా సామాను స్వయంగానే దింపుకుని బండీ దిగాను అప్పుడు ఒకకూలీ పరుగెత్తుకుని వచ్చి నాపెట్టే బెడ్డింగూ తలమీద పెట్టుకున్నాడు. ఒక జట్కా చేయించుకుని అందులో కూర్చున్నాను. కూలీ డబ్బు అడిగినట్లులేదు. జట్కా ఎక్కడికి వెళ్ళిందీ తెలియలేదు.

తర్వాత నిద్రపోయాను చెరుపూ మరుపుగా. తెలివి వచ్చేసరికి తెల్లవారింది. మరొక అరగంటకు గమ్యస్థానం వస్తుందనగా, నేను ముఖం కడుక్కుని బెడ్డింగు కట్టుకుని దుస్తులు మార్చుకున్నాను. ఒక స్టేషనులో టీ తెప్పించుకుని తాగాను. శివపురం స్టేషను ప్లాట్‌ఫారంమీదికి బండీ వచ్చేసరికి నేను కూర్చున్న పెట్టెతలుపు తెరచుకుని ద్వారందగ్గర నుంచున్నాను బండీ ఆగింది. నా కోసం యే వ్యక్తులూ వచ్చిన జాడ కనబడలేదు. బండీనుంచి దిగేవారు దిగుతూ వుండగా ఎక్కేవారు హడావిడిగా ఎక్కుతున్నారు. ఒక నిమిషం నిరీక్షించి, బండీ దిగి పోర్టరుచేత సామాను దింపించి వెయిటింగ్రూముకు వెళ్ళాను.

అయిదు నిమిషాలు గడిచింది. పోర్టరు కొంచెం దూరంగా నుంచునే వున్నాడు. ఇక ఆగలేక 'బాబూ! సామాను జట్కాలో పెట్టమన్నారా ?'- అని అన్నాడు.

'నేను యీ బండీలో వస్తున్నానని ఆ తగుమనిషికి రాసేను. మరియెందుకు రాలేదో ?'

'బాబూ ! బండీ గంట లేటుగదా ! వచ్చి వెళ్ళిపోయి వుండవచ్చు. మీ రెక్కడికి వెళ్ళాలో చెప్తే జట్కా కుదురుస్తాను లెండి. ఇంటిదగ్గిరే ఆయన్ను కలుసుకోవచ్చు'

బండీ గంట లేటు చేసినందుకు రైల్వే వాళ్ళమీద నాకు విపరీతంగా కోపం వచ్చింది. ఈ రోజు యిచ్చే ఉపన్యాసంలో వాళ్ళను ఒక దులుపు దులపాలని అనుకున్నాను.

'నేను యీ వూరికి యెప్పుడూ రాలేదు. యెవరియిల్లూ నాకు తెలియదు. యెవ్వరియింటికీ యెందుకు వెళ్ళాలి ? తిన్నగా లైబ్రరీకే వెళ్తాను. సామాను జట్కాలో వెయ్యి' అని ఆదేశించాము పోర్టరుకి.

టిక్కెట్టు కలెక్టరుకు టిక్కెట్టు యిచ్చివేసి, బయటపడి సామానువేసిన జట్కాలో కూర్చుని పోర్టరుకు ఒక రూపాయి యిచ్చి పంపివేశాను.

'బాబూ ! ఎక్కడికి వెళ్ళాలి' అని జట్కావాలా అన్నాడు.

'జనోపయోగ గ్రంథాలయం' అనే లైబ్రరీ యీ వూళ్ళోవుందిగదా ! అక్కడికి తీసుకువెళ్ళు.'

'బాబూ ! అదెక్కడున్నదీ నాకు తెల్వదండి.'

'అది కాదోయ్. పెద్ద పెద్ద బీర్వాలలో పుస్తకాలుండి, నలుగురూచేరి పేపర్లూ అవీ చదువుకునే చోటులేదూ ? అక్కడికి వెళ్ళాలి'

'అలాంటిదేదీ యీ వూళ్ళో లేదండి. యిది అంత పెద్ద బస్తీ కాదు. ఈ వూళ్ళో వున్నవన్నీ నాకు తెలుసునండి !'

ఒక క్షణం ఆలోచించాను.

'వీరేశ్వరరావుగారి యిల్లు తెలుసునా?'

'తెలియకేమండి. బాగా తెలుసును. చాలా మంచివారండి ! దేశంకోసం పాటుపడుతున్న మనిషి అని అందరూ అనుకుంటారు బాబూ !'

'అయితే వారియింటికే జట్కా పోనియ్యి'

జట్కా వూళ్ళో ప్రవేశించి గతుకుల రోడ్డులో ప్రయాణం సాగించింది. కుదుపులతో నా వొళ్ళు హూనమై పోయింది. జట్కా వెళ్తూవుండగా అక్కడక్కడ జనం తొంగిచూడ సాగారు. ఇది నాకు కొంత ఆశ్చర్యమనిపించింది. కొంచెం సేపటికి జట్కా ఒక చిన్నయింటిదగ్గిర ఆగింది.

'ఇదేనండి ఆయన వుండే [illegible]!'

అన్నాడు జట్కావాలా.

బండీ ఆగడం చూసి యింటిలోపట్నుంచి ఒక వ్యక్తి తొందరగా బయటికి వచ్చి, బండీనుంచి దిగిన నన్ను చూసి 'దయచెయ్యండి ధనంజయంగారూ!' అని నమస్కారపూర్వకంగా ఆహ్వానించాడు.

ఆయనే వీరేశ్వరరావని అనుకున్నాను.

ఆయన సామాన్లు ఒకగదిలో పెట్టించి, జట్కావాడికి యియ్యవలసిన అద్దెయిచ్చి పంపివేశాడు. ఆ గదిలోవున్న రెండు కుర్చీలలో యిద్దరం కూర్చున్నాం.

ఉపన్యాసం యివ్వడానికి నన్ను పిలవడం నాకే ఆశ్చర్యమైంటని నేను ప్రారంభించాను ప్రసంగానికి.

ఫోటోతోకూడా పడిన నా వ్యాసాలు ఒకటి రెండు-పత్రికల్లో తాను చూచాననీ, పేరు ప్రఖ్యాతులున్నవారి వ్యాసాలే పత్రికలవాళ్లు వేసుకుంటారు కనుక నేను గొప్ప వ్యక్తినని తానుభావించాననీ ఆయనఅన్నాడు. నావంటివాడు తన ఆహ్వానాన్ని గౌరవించి రావడం అపూర్వ అదృష్టమే అని స్తుతించాడు.

తర్వాత ప్రసంగంలో సందర్భవశాన 'మీరెవ్వరినైనా స్టేషనుకు పంపిస్తారని అనుకున్నాను. ఎవ్వరూ రాకపోవడంవల్ల కొంచెం ఆందోళనపడ్డాను' అన్నాను.

'మీరు ఈ బండీలోనే వస్తారని

# యత్నం లేని యశస్సు

తెలుసు. అందుకోసమే యిద్దరు వలంటీర్లను పంపాను. ట్రయిను లేటయింది కదూ! అందువల్ల మళ్లీ రావచ్చునని వాళ్లు కార్యాంతరంమీద వెళ్లిపోయినట్లున్నారు. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించాలి' అని ఆయన సమాధానం చెప్పుకున్నాడు.

తర్వాత స్నానాదులు ముగించుకున్నాను. మేమిద్దరం యిష్టాగోష్టిగా మాటలాడుకుంటూ భోజనం ముగించాం. తర్వాత హడావిడిగా దుస్తులు వేసుకుని బయలుదేరుతూ 'రాత్రి ప్రయాణంనుంచి మీకు బాగా నిద్రపట్టి వుండదు. రెండు గంటలసేపు నిద్రపోతే మంచిది. నేను తొందరగా పోయి కొన్నియేర్పాట్లు చేసుకోవాలి. మళ్లీ వస్తాను.' అంటూ వీరేశ్వరరావు ఎక్కడికో వెళ్లిపోయాడు.

నేను ఆ గది నలుమూలాలా పరిశీలించాను. ఒక గోడవారగా ఒక చిన్నబీరువా కొన్ని పుస్తకాలతో కానవచ్చింది. 'జనోపయోగ గ్రంథాలయం' అని వ్రాసిన చిన్న అట్ట ఆ బీర్వాకు తగిలించబడి వుంది. ఆ గ్రంథాలయం తాలూకు పుస్తకాలు కొన్ని యీ బీరువాలో వుంచి వుండవచ్చని అనుకున్నాను. గదిలో వున్న రెండుకుర్చీలనూ, ఒక టేబిలునూ ఒకవారకు పెట్టి నేల మీదనే బెడ్డింగు పరుచుకుని పడుకున్నాను. రాత్రి కలతనిద్ర అయింది. అందువల్ల యిప్పుడు బాగా నిద్రపట్టింది. తెలివి వచ్చి చూసేసరికి రెండుగంటలైనది. నేను తొందరగా లేచి పడక చుట్టేసి నూతిదగ్గిరికి పోయి ముఖం కడుక్కొని వచ్చాను. నేను గదిలోకి వచ్చేసరికి వీరేశ్వరరావు నా కోసం కాఫీ పట్టుకొని వచ్చాడు.

'సభ మూడున్నర గంటలకే కదూ!' అని అన్నాను.

'అలాగే ప్రోగ్రాంవేశాం మరి'

'అంతా సిద్ధమయినట్లేనా?'

'ఒక్కటి తప్ప అంతా సిద్ధంగానే వుంది. మనసభకు అధ్యక్షత వహించవలసిన రమేశ్ బాబుగారు రాలేదు. ఆయన నివాసం యీ పక్కనున్న వూరే! పదిగంటలకే సైకిలుతో మనిషిని పంపాను, మూడు గంటలకయినా రావాలని. కాని ఆయనకు ఆరోగ్యం సరిగా లేదట! రాలేననీ, క్షమించాలనీ వార్త పంపారు. ఆ కబురు ఒక గంట కిందటే అందింది. ఏమి చెయ్యడానికీ పాలుపోకుండా వున్నది.'

'మరెవరినైనా అధ్యక్షుడుగా నిర్ణయిస్తే.'

'ఆ విధంగాకూడా ఆలోచించాను. అదీ కుదిరేటట్లు లేదు. ఈకాలంమనుషుల సంగతి మీకూ తెలుసును! అందరికీ ఆత్మాభిమానం యెక్కువ. 'మొదటనే పిలవకుండా, ఇప్పుడు నిర్ణయించుకున్న ఆసామీ రానందున మమ్మల్ని పిలుస్తున్నారు కదూ!' అని అంటారు. అందులోనూ మావూరివాళ్లు మరీ అసాధ్యులు!'


'అయితే మరి మార్గం యేమిటి?'

'అదే, ఆలోచనగావుంది, పోనీ, ఈవాళ కాకపోతే రేపయినా మహాసభను పెట్టుకుందామనుకుంటే—రమేశ్ బాబు రేపుకూడా వచ్చేస్థితిలో వున్నట్లు తోచదు. మిమ్మల్ని కూడా ఒకరోజు నిలిపివెయ్యవలసి వస్తుంది'

నేను వెంటనే అందుకున్నాను—

'రేపు నేనిక్కడ వుండడానికి వీలుకాదు. రేపు మావూళ్లో అర్జంటుపని వున్నది. ఈరాత్రి ఎనిమిదిగంటల బండీలో బయలుదేరి వెళ్లక తప్పదు.'

'సరే! మమ్మల్నిగురించి మీపనులు పాడుచెయ్యడం నాకునూ సమ్మతం కాదు.



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
చికిత్సను పొందండి
శస్త్రచికిత్స
అవసరముండదు!
DOL-727 TEL

వాయిదాలచెల్లింపుపై ట్రాన్సిస్టర్

రు 285/— వెంగల ప్రపంచ ప్రఖ్యాత నేషనల్ డీలక్స్" 3 బాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రానసిస్టర్‌ను నెలకు రు 10 వంతున చెల్లించి పొందండి ప్రతి గ్రామమునకు, పట్టణమునకుపంపవచ్చు సేల్స్‌ప్రతినిధులు కావలెను / నియమించండి
IMPEX INDIA (WAP)
P B 1045, DELHI—6

**1969–70 లో మీ అదృష్టము**
మీరు ఒక పోస్టుకార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండునెలల్లో జరుగు ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభనష్టాలు, సర్వీసులో ప్రమోషన్ & ట్రాన్స్ఫర్, పిల్లల జననం, వివాహం, సుఖ సంతోషాల

మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1–25 లకే పంపెదము. పోస్టేజిఅదనం ఒకదఫాచూచినతృప్తి చెందగలరు
PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI (MAP)
P.B 86, JULLUNDUR CITY.

# యత్నం లేని యశస్సు

ఈ రాత్రి బండీలో మీరు వెళ్ళడానికి యేర్పాట్లు చేస్తాను లెండి— అయినా మీకు నిష్కారణంగా శ్రమ కలిగించినందుకు చాలా బాధగావుంది మనస్సులో.'

'నాకు అంతగా శ్రమ యేమీ లేదు. మీ ఆహ్వానమూలంగా మీ వూరికి రావడమూ, మిమ్మల్ని చూడడమూ జరిగింది. నా రాకపోకలను గురించి మీకే అనవసరంగా కొంత ఖర్చు అవుతున్నందుకు నాకే కష్టమనిపిస్తున్నది' అని అన్నాను, నా రైలు ఛార్జీలూ అవీ యివ్వడేమో అనే సందేహంతో.

'ఇలాంటి మహత్కార్యాలు తలపెట్టినప్పుడు ఖర్చులకోసం వెనకతీస్తామా, సర్! అనుకున్న ప్రోగ్రాంప్రకారం జరగలేదే అనే నా విచారం' అన్నాడు వీరేశ్వరరావు.

'ఇక్కడికి ఉపన్యాసం యివ్వడానికి వచ్చిన సంగతి నా మిత్రులందరికీ తెలుసును ఇది జరక్కపోవడంవల్ల నాకు ఎంతో తలవంపులుగా వుంటుంది. ఇది మాత్రం కొంచెం కష్టంగా ఉన్నది.'

'క్షమించండి. ఇలా అవుతుందని అనుకోలేదు అయినా మీ కీర్తికి యేమీ భంగం కలగకుండా వుంటుందని మాత్రం చెప్పగలను. గౌరవానికి భంగం వుండదు'

ఇలాచెప్పి అతడు పనిమీదకాబోలు ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఖైదీమాదిరిగా నేనా గదిలోనే వుండిపోయాను.

రాత్రి ఏడుగంటలకి వీరేశ్వరరావు నిర్బంధంవల్లరెండుమెతుకులు తిని పెట్టె, బెడ్డింగులతో జట్కా ఎక్కి రైలుస్టేషనుకు బయలుదేరాను. తానుకూడా స్టేషను దాకా రావడానికి రావు సిద్ధపడ్డాడు గాని, నేనే వద్దన్నాను.

బండీ రావడానికి యింకా అరగంట టైము ఉంది. నేను వెయిటింగు రూములో ఈజీచైరులో కూర్చుని జరిగిన సంఘటననుగురించే ఆలోచిస్తున్నాను. అప్పుడు ఒక అపరిచిత వ్యక్తి వచ్చి నమస్కారంచేసి ఎదురుగావున్న మరోకుర్చీలో కూర్చున్నాడు.

నేను అతనివేపు వింతగా చూడడం గమనించి 'నాపేరు మహేశమండి! నేను మీకు కొత్తవాడనే కాని మిమ్మల్ని ఉదయమే వీరేశ్వరరావుగారి యింటిదగ్గర చూశాను. వారిపోరుపడనే మాయిల్లు! తమ ఉపన్యాసాన్ని నేను వినాలని ఎంతో కుతూహలపడ్డాను కాని, ఆవేళకే అత్యవసరమైన పనిమీద పక్కవూరికి వెళ్ళవలసి వచ్చింది. మీ ఉపన్యాసం వినేభాగ్యం లేకపోయింది. నేనూ యీ బండీలోనే పక్కనున్న కృష్ణనగరుకు వెళ్ళవలసి వచ్చినందున మీతో యిప్పుడు మాటలాడే భాగ్యమయినా కలుగుతున్నది' అని అతను అన్నాడు.

'మీకు ఆవిచారం అక్కర్లేదు అసలు సమావేశమే జరగడం లేదు' అన్నాను.

'సమావేశం జరగడం సందేహమే అని నేనూ అనుకున్నాను లెండి. వాడున్నాడే— ఆ రఘుపతి — యీ సమావేశాన్ని జరగనిస్తాడా? పాపం! వీరేశ్వరరావు తలపెట్టిన ప్రతిపనికీ అడ్డు తగులుతూనే ఉంటాడు.'

'ఎవరా రఘుపతి?'

'మా పంచాయితీ బోర్డులో ఒక మెంబరు! వెనకటి ఎలక్షన్లలో తనకు రావుగారు వ్యతిరేకంగా పనిచేశారని అతని అనుమానం. అందువల్ల ఏదో నెమ్మదిగా జీవనం గడుపుకుంటున్న రావుగారిని నానా విధాలా బాధపెడుతున్నాడు. రావుగారి జీవనాధారమైన జనోపయోగ లైబ్రరీకి పయి అధికారులు శాంక్షను చేసిన సొమ్ముకూడా అందకుండా వుండేటట్లు చేశాడు.'

'ఏమిటి వీరేశ్వరరావుగారు లైబ్రరీ మీదే ఆధారపడి వున్నారా?'

'అవునండి మానవుడికి ఏదో ఒక జీవనమార్గం ఉండాలికదా! రావుగారు తమ యింట్లోనే ఒక బీరువాలో కొన్ని పుస్తకాలు ఉంచి 'జనోపయోగ గ్రంథాలయం' అని పేరుపెట్టి చందాదారులను చేర్చి కొంతసొమ్ము వసూలు చేస్తూ వుంటాడు. ఇళ్ళకు తానే స్వయంగాపోయి పుస్తకాలూ సంచికలూ అందిస్తాడు. వేర్వేరుగా జాబులు రాసి, లైబ్రరీపేర పత్రికలను ఉచితంగా సంపాదించి, అవి కొన్నట్లు లెక్కలు చూపిస్తాడు. పాత పుస్తకాలను చౌకగా కొని, పూర్తివెలలు చూపుతాడు. ఉత్సవాలపేరుతో విరాళాలను పోగు చేస్తాడు. ఇలా చెయ్యకపోతే జీవనం గడవదు. రఘుపతి యీ లోపాలన్నీ పై అధికారులకు చూపి శాంక్షనయిన సొమ్ము కూడా రాకుండా చేశాడు.'

'పాపం! వీరేశ్వర్రావు చాలా బాధపడి వుంటాడు'

'బాధకాదా మరి? చేతికి అందిన పైకం జారిపోతే. రఘుపతి దుర్మార్గం యింకా చూడండి. రావుగారు నేటి మహాసభను హైస్కూల్లో ఏర్పాటుచేసి, రమేశ్ బాబుగారిని అధ్యక్షుడుగా నిర్ణయించారా మరి! రమేశ్‌బాబు రఘుపతికి మామగారు! అల్లుడి పట్టుదలవల్ల ఆయన సభకు రానని వర్తమానం చేశాడట!'

'రమేశ్ బాబుకు ఆరోగ్యం సరిగా లేదటగా!'

'బంగార్లాగున్నాడు. నిన్న సాయంకాలం బజార్లో నేను చూశాను. అది కల్పించుకున్న సుస్తీయేగాని యదార్థమైనది ఎంతమాత్రమూ కాదు.'

'అదా సంగతి! ఇలా చెయ్యడం రఘుపతికి తగదు'

'ఇంతేకాదు. గ్రంథాలయోత్సవం జరిగే సమయానికే హైస్కూలు పక్కనవున్న టౌనుహాలులో ఉచితంగా సినిమా ప్రదర్శనను ఏర్పాటు చేశాడు. అతని వక్రబుద్ధి చూడండి! ప్రజ సినిమా చూడడానికి వెళ్ళుతుందికాని, ఉపన్యాసాలు వినడానికి వస్తుందా?'

'మీ రన్నమాట నిజమే! ఇది గమనించే వీరేశ్వర్రావు సమావేశాన్ని నిలిపివేసి వుంటాడు.'

'ఇందులో సందేహం లేదండి! మీవంటి తగు మనుష్యులు పై వూరునుంచి వస్తున్నారని తెలిసికూడా రఘుపతి ఇలా చెయ్యడం మావూరికే అప్రతిష్ఠ.'

మహేశం చెప్పవలసినది యింకా వున్నట్టే కానవచ్చింది. కాని, యింతలో బండీ రావడంవల్ల ఆ ప్రసంగం నిలిచిపోయింది. నేను సెకెండుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కుతూ వుండడం చూసి, మహేశం మరోకవైపు వెళ్ళిపోయాడు నావద్ద సెలవుతీసుకుని.

మర్నాడు యింటికి వెళ్ళేసరికి కౌస్తుభం నాకోసం కాచుకుని వున్నాడు. అప్పటికి నేను తప్పకుండా శివపురంనుంచి వచ్చేస్తానని నిశ్చయంతో నన్ను చూడగానే' ఏమోయ్! సభ బాగా జరిగిందా? నీ వుపన్యాసం విని అక్కడివాళ్ళు ముగ్ధులై వుంటారనుకుంటాను. నావూహ నిజమేనా?' అన్నాడు.

నేను వెంటనే సమాధానం చెప్పలేదు. నా ముఖం బాగా వాడి వుండడం చూసి 'పాపం! రాత్రి నిద్రలేదు కాబోలు' అన్నాడు.

'అదేమీకాదు. అసలు సభే జరగలేదు. ఏవో కొన్ని అనివార్యకారణాలవల్ల వాయిదా వేశారు. ఒకటి రెండు రోజులాగమన్నారు. నాకు వీలుకాదనిచెప్పి చక్కా వచ్చివేశాను,' అని జరిగినదానిని కొంత కప్పిపుచ్చి అన్నాను

'పోనీ ఛార్జీలేనా యిచ్చేరా?'

'ఇవ్వకేం? నాకు ఈ ప్రయాణంలో యెంత ఖర్చయినదీ తెలిసికొని పైసలతో కూడా యిచ్చివేశారు.

'మళ్ళీ ఆహ్వానం వస్తుందన్నమాట!' అని అంటూ చిరునవ్వునవ్వి అతడు వెళ్ళిపోయాడు.

మరి నాలుగురోజులు గడిచింది.

నేను ఉదయం కాఫీ తీసుకుని న్యూస్ పేపరు చదువుకుంటూవుంటే కౌస్తుభం ఒక తెలుగుపత్రికను చుట్టచుట్టి చేతిలో పట్టుకొనివచ్చి 'ధనంజయం! నువ్వు భలే వాడివోయ్! దివ్యంగా జరిగిన మహాసభలో అద్భుతంగా గంటసేపు మహోపన్యాసం యిచ్చి, దాన్ని గురించి అడిగితే లేదని బుకాయిస్తావా? అలా చెప్పడంలో నీ అభిప్రాయం యేమిటి?' అని కొంచెం కోపంగానే అన్నాడు.

నాకేమీ అర్థంకాక నిర్ఘాంత పోయాను.

అతడు చేతిలోవున్న పత్రికను నా మీదికి విసరివేశాడు. అది 'దేశవార్తలు' అనే వారపత్రిక. నేను పేజీలు తిప్పి చూడగా ఒకపుటలో పెద్ద అక్షరాలతో 'ధనంజయంగారి మహోపన్యాసం' అనే శీర్షిక కనిపించింది. 'దానికింద "కడచిన గురువారం నాలుగ్గంటలకు శివపురంలోని జనోపయోగ గ్రంథాలయం వార్షికోత్సవంలో సుప్రసిద్ధ సారస్వత సేవకులూ, రచయితలూ అయిన శ్రీ ధనంజయంగారు గంటసేపు సుదీర్ఘోపన్యాసం చేసి, సారస్వతాన్ని గురించీ గ్రంథాలయోద్యమాన్ని గురించీ అనేక విషయాలను చెప్పి సభికులను ముగ్ధులను చేశారు. చక్కని సలహాలను యిచ్చారు. ఆ సభకు ఆ గ్రంథాలయ పర్యవేక్షకులు శ్రీ వీరేశ్వర్రావుగారే అధ్యక్షత వహించారు. అనివార్య కారణాలవల్ల మొదట నిర్ణయించబడినట్లు సుప్రసిద్ధ జాతీయ నాయకులూ గ్రంథాలయోద్యమ పితామహులూ అయిన శ్రీ రమేశ్‌బాబు గారు అధ్యక్షత వహించలేక పోయారు.'

ఇది దానిలోని మొదటిపేరా.

ఇంకా రెండోపేరాలో నా వుపన్యాసంలో —నేను అనుకోని విషయాలను గురించిన వివరణం ఉన్నది.

నా ఆశ్చర్యానికి అంతం లేకపోయింది. మహేశం చెప్పిన సంగతులన్నీ జ్ఞప్తికి వచ్చాయి. వీరేశ్వర్రావు ప్రోగ్రాము జరక్కుండా చేద్దామనిగదా రఘుపతి పట్టుదల! అతన్ని బాగా బోల్తా కొట్టించడానికి వీరేశ్వర్రావే యీ సమాచారాన్ని పత్రికకు పంపించాడని ఊహించాను.

నాకు పట్టరాని నవ్వు వచ్చింది. కౌస్తుభానికి విషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరంగా చెప్పాను.

కౌస్తుభం ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

